
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025 5 అనంతపురం



అధికారులపై 'టేకులోడు'..!

◆ చిలమత్తూరు రెవెన్యూలో గందరగోళం
◆ ఒక్కొక్కరుగా మారుతున్న అధికారులు
◆ టేకులోడు భూసేకరణతో అదిరిపోతున్న అధికారులు
◆ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా..?



ప్రజాశక్తి-చిలమత్తూరు

హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలోని టేకులోడు రెవెన్యూ పొలంలో భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇది జరుగుతున్న సమయంలో అధికారులు ఒకరి తర్వాత ఒకరు సెలవుపై వెళ్తుండడం, ఆర్ఐ, ఇద్దరు వీఆర్వోలను వేరే మండలానికి డిప్యూటేషన్ చేసే పరిణామాలు చర్చకు దారితీస్తున్నాయి. మండలంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక గత తహశీల్దార్ నటరాజ్ ఆరోగ్య సమస్య పేరుతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో హిందూపురం తహశీల్దార్ వెంకటేష్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. తాజాగా రెవెన్యూ ఇన్స్పెక్టర్, టేకులోడు వీఆర్వో, మరో విఆర్వోని డిప్యూటేషన్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన పని చేయని కారణంగానే వారిని డిప్యుటేషన్ చేసినట్లు సమాచారం. ఇలా చిలమత్తూరు రెవెన్యూలో జరుగుతున్న అధికారుల స్థాన చలనంపై పెద్ద చర్చ నడుస్తోంది.

టేకులోడు వీఆర్వో మార్పు..

భూ సేకరణ జరుగుతున్న రెవెన్యూ పొలంలో అప్పటికే పని చేస్తున్న అధికారులను తొలగించరు. కొత్తవారొస్తే భూ సేకరణ మరింత ఆలస్యం అవుతుందన్న కారణంతో పాతవారితోనే ఈ పనినికానిస్తారు. అలాంటిది భూసేకరణ జరుగుతున్న టేకులోడు గ్రామ విఆర్వోను మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుపట్టని విషయం. ఈ ఉద్యోగి మార్పు వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్త వీఆర్వోని నియమిస్తే కొత్తగా వచ్చిన ఆ అధికారి సేకరణ పనులను వేగవంతం చేస్తారా.? అన్నది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంది. ఒకవేళ పాత విఆర్వోపై ఏవైనా అవినీతి విమర్శలుంటే ఆయనపై చర్యలు తీసుకుంటారు. అలాకాకుండా డిప్యుటేషన్ వేయడం ఏమిటన్న ప్రశ్న ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది.

ఇన్‌ఛార్జి తహశీల్దార్ పాలన


చిలమత్తూరులో డీటీగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథ్ సీనియర్ ఉద్యోగి. ఈయనకు రెవెన్యూ విభాగంపై పూర్తిగా అవగాహన ఉంది. తహశీల్దార్ లేని కారణంగా ఈయనకు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వొచ్చు. అలా చేయకుండా అధికార పార్టీ నాయకులు పట్టుబట్టి ఇన్‌ఛార్జిగా హిందూపురం తహశీల్దార్‌ను తెచ్చుకున్నారు. ఆయనకు ఇన్‌ఛార్జి ఇస్తే తమ పనులు చక్కబెట్టుకోవచ్చని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. త్వరలో ఈయనే చిలమత్తూరు తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారని కూడా అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే సమయంలో చిలమత్తూరు డిప్యూటీ తహశీల్దార్ జనార్ధన్‌ను డిప్యూటేషన్ చేసేందుకు చాపకింద ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం.

ఇంతకీ ఆ నేతలు చెప్పిన పనేంటి?

వరుస డిప్యూటేషన్ల నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు అధికార పార్టీ నేతలు ఏ పని చెప్పారు.? అధికారులు ఆ పని చేయడానికి ఎందుకు బయపడుతున్నారు.? అన్నది చర్చగా మారింది. టేకులోడు భూముల విషయంలో అధికార పార్టీ నాయకులకు అధికారులు సహకరించలేదన్నది ప్రాథమికంగా జరుగుతున్న చర్చ. మరి ఆ రెవెన్యూ పొలంలో సెజ్‌కు సంబంధించిన భూముల్లో అధికార పార్టీ నేతల భూములు ఉన్నాయా... లేక ఇతరుల భూములను కాజేసేందుకా..? అన్న చర్చ మండలంలో జోరుగా జరుగుతోంది.

రైతుల్లో ఆందోళన

చిలమత్తూరులో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కొనసాగుతున్నారు. ఆయన అప్పుడప్పుడే కార్యాలయానికి వస్తారు. డిటి, ఆర్ఐ, వీఆర్వోలని ఒక్కొక్కరిగా డిప్యుటేషన్ చేస్తున్నారు. అధికారుల మార్పుతో మండల ప్రజలు, ముఖ్యంగా భూసేకరణ జరుగుతున్న టేకులోడు రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సేకరణ జాబితాలో భూమి ఉండి, వివిధ కారణాలతో ఇంకా నష్ట పరిహారం అందని రైతులు పాసు పుస్తకాలు పట్టుకుని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు పాసు పుస్తకాలు లేక డీ పట్టాలను వీఆర్వోకు ఇచ్చారు. రైతులకు సమాచారం ఇచ్చే అధికారి లేక వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అధికారుల మార్పు వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలను బహిర్గతం చేసి రైతుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.





పోలీసు అమరవీరులను స్మరించుకుందాం

21 నుంచి జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు
ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం



ఎస్పీ జగదీష్

ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అమర వీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో వారోత్సవాలకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలియజేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమయ్యిందన్నారు. ఇందులో భాగంగా 21న అమరవీరుల సంస్మరణ దినం, స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు, శ్రద్ధాంజలి ఘటిస్తామన్నారు. పోలీసు అమర వీరుల స్థూపం వద్ద అమర వీరుల సంస్మరణ దినం జరగనుంది. 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాల సందర్శన చేసి, వారి త్యాగాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. 24 నుంచి 27 వరకు పాఠశాలలు, కళాశాలల్లో చర్చావేదికలు, వక్తృత్వపు పోటీలు ఉంటాయన్నారు. 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 26, 27, ఓపెన్ హౌస్‌ల నిర్వహణ ఉంటుందన్నారు. ఇందులో పోలీసులు నిత్యం వినియోగించే ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 28న వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. 31న సమైక్యతా దినంలో భాగంగా ఉదయం యూనిట్ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమర వీరుల వారోత్సవాలు ముగుస్తాయన్నారు.. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజవంతం చేయాలని ఎస్పీ కోరారు.

ముఖ్యమంత్రి స్పందన హర్షణీయం

ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు బి.చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు హర్షణీయమని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, డి.చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డీఏను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషకరంగా ఉందన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ వార్డు సచివాలయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ నిరంతరం కషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు జమీలబేగం, నగర నాయకులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ :ఉద్యోగుల డీఏ ఇతర సమస్యల ముఖ్యమంత్రి స్పందించి నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అని ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల మాధవ, కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షులు తిరుపాలయ్య, కార్యదర్శి రాకేష్, సభ్యులు డాక్టర్ చరణ్, సుజాత సుభాషిని గంగరాజు, ఫజల్, అచ్చమ్మ, ఓబులమ్మ, నల్లప్ప, అనిల్ హర్షం వ్యక్తం వచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు

950 మెట్రిక్ టన్నుల యూరియా రాక

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాకు ఆర్‌సిఎఫ్ కంపెనీకి చెందిన యూరియా 950 మెట్రిక్ టన్నులు ఆదివారం వచ్చినట్లు ఎడిఎ అల్తాఫ్ తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 700 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్లకు 250 మెట్రిక్ టన్నులను జాయింట్ కలెక్టర్ ఆదేశం ప్రకారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

చిరుత దాడిలో ఆవు, దూడ మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

చిరుత దాడి చేయడంతో ఓ ఆవు, దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపురం గ్రామం చోటుచేసుకుంది. వివరాలు రైతు వెంకటేష్ తోటలో ఉన్న ఆవు, దూడపై శనివారం అర్ధరాత్రి చిరుత దాడి చేసి రెండింటినీ చంపేసింది. రైతు ఆదివారం తెల్లవారుజామున తోట వద్దకు వెళ్లి చూడగా మృతి చెందిన ఆవు, దూడలను చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. వాటి మృతితో వేలాది రూపాయలు నష్టపోయినట్లు బాధితరైతు వాపోయాడు. ఈ విషయాన్ని కళ్యాణదుర్గం అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రైతుతో వివరాలు సేకరించారు. నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు వివరాలు పంపుతామని తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పామిడి


ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధ రించాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, రామాంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారం చేపట్టి 15 నెలలైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు వివాహ సమయంలో రూ. లక్ష, వారి భార్యల మొదటి, రెండో కాన్పులకు రూ. 20వేల చొప్పున సాయం, చదువుకునే పిల్లలకు స్కాలర్‌షిప్, కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 5 లక్షల బీమా, అంగవైకల్యం ఏర్పడితే రూ. 2.5 లక్షల పరిహారం, తదితర ప్రయోజనాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు మల్లేష్, అధ్యక్షులు మాబు, కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి శివకుమార్, సభ్యులు నల్లప్ప, ఆంజనేయులు, వెంకటస్వామి, నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నెట్టికంటి, బాబుపీరా, నూర్ మహమ్మద్, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామాంజినేయులు

పేలుతున్న బాణసంచా ధరలు

రూ.వెయ్యి తీసుకెళ్లినా చిన్న కవర్‌కు రాని టపాసులు
అమ్మకాల్లో నిబంధనలకు తిలోదకాలు
అధికార పార్టీ నేతల వసూళ్ల పర్వం



ప్రజాశక్తి-అనంతపురం

దీపావళి సందర్భంగా అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీలో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. అనంతపురం, అనంతపురం రూరల్ పరిధిలో 114 దుకాణాలకు అధికారులు అనుమతి పత్రాలను అందించారు. తాత్కాలిక జీఎస్టీ, ఫైర్, రెవెన్యూ, విద్యుత్ శాఖల సమన్వయంతో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో టపాసుల విక్రయాలు మొదలు పెట్టారు. ఆది,సోమవారాల్లో ఈ వ్యాపారాలు కొనసాగనున్నాయి. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా టాపాసుల ధరల మోత మోగుతోంది. టపాసుల ధరలకు హద్దూఅదుపు లేకుండా వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. వెయ్యి రూపాయలు తీసుకెళ్తే కనీసం ఒక ప్లాస్టిక్ కవర్ కూడా టపాసులు వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ఇక దుకాణ దారుల నుంచి అధికార పార్టీ నాయకులు ఒక్కొక్క స్టాల్ నుంచి రూ.40 వేలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. వ్యాపారస్తులు ఈ విషయంలో తీవ్రమైన అసహనం వ్యక్తం చేస్తున్నారు. టపాసుల వ్యాపారంలో జీఎస్టీ ఇతర నిబంధనల విషయంలో సంబంధిత అధికారులు నిబంధనలను పక్కనపెట్టి అనుమతులను ఇచ్చారు. నిబంధనలను పక్కనబెట్టినందుకు ఈ శాఖల అధికారులకూ భారీగా ముట్టినట్లు సమాచారం. ఏది ఏమైనా దీపావళి ప్రజలపై టపాసుల మోత మోగుతుంటే అధికార పార్టీ నాయకులు, అధికారులకు మాత్రం కాసుల మోత మోగిస్తోంది.

రీసర్వేతో రైతులకు ఉపయోగం

జిల్లా భూమి రికార్డుల ఏడీ విజయశాంతి



జిఎస్.విజయశాంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రభుత్వం చేపట్టిన భూముల సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం చేకూరుతుంది. రీ సర్వే రైతులకు ఉపయోగకరమైనందున ప్రస్తుత కూటమి ప్రభుత్వం పారదర్శకంగా దీనిని అమలు చేస్తోంది. అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు, ఆక్రమణలు, సాగు ఒకరు.. భూ రికార్డుల్లో మరొకరు తదితర సమస్యలన్నీ రీ సర్వేతో పరిష్కారం అవుతాయి' అని జిల్లా సర్వే శాఖ ఏడీ విజయశాంతి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రీ సర్వే పనులు చేపడుతున్న చర్యలపై ప్రజాశక్తికి ముఖాముఖిలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : జిల్లాలో భూ విస్తరణం ఎంత.? గతంలో ఎన్ని ఎకరాలు, ఎన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు.?

ఎడి : జిల్లాలో మొత్తం 20,91,976.25 ఎకరాల భూమి ఉంది. 32 మండలాల్లో మొత్తం 461 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో 161 గ్రామాల్లో 4,02,857.9 ఎకరాలు రీ సర్వే జరిగింది. మొదటి విడతలు జిల్లాల 32 గ్రామాలు రెండో విడతలు 23 గ్రామంలో మొత్తం సర్వే పూర్తయింది. మూడవ విడత ఒక గ్రామంలో రీ సర్వే జరుగుతోంది. మొత్తం 1.06 లక్షల ఎకరాల్లో సర్వే జరుగుతోంది. గతంలో రెండు విడతలో రీ సర్వే జరిగిన భూముల్లో సర్వే రాళ్లు పాతడం పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు.



ప్రశ్న:సర్వేలో ఏఏ అధికారులు పాల్గొంటారు.? వాటి వివరాలు ఏమిటి.?

ఎడి: రీ సర్వేలో ప్రధానంగా సచివాలయంలోని గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు మండల సర్వేయర్లు పాల్గొంటారు. జిల్లాలో మొత్తం 355 మంది గ్రామ సర్వేయర్లు ఉన్నారు. వీరంతా రీ సర్వేలో కీలకంగా ఉంటారు. మొదట విలేజీ బౌండరీ తర్వాత ఆయా గ్రామాల రెవెన్యూ పొలంకు సంబంధించిన రికార్డులు ఆయా రైతుల పట్టాదారు పుస్తకాలు ఆధారంగా సర్వే ప్రారంభించడం జరుగుతుంది.

ప్రశ్న- రైతుల మధ్య భూ తగాదాలను ఎలా పరిష్కరిస్తారు.?

ఎడి:ప్రధానంగా అన్నదమ్ముల భూమి తగాదాలు, సాగులో ఒకరు ఉంటే రికార్డులో మరొకరు ఉంటారు. భూ అక్రమణాల సమస్యలూ ఉంటాయి. కోర్టు కేసుల్లోనూ భూ సమస్యలుంటాయి. ఇలాంటి వాటి అన్నింటినీ రీ సర్వేద్వారా పరిష్కరించేందుకు వీలుకలుగుతుంది. సమస్య ఉన్న ఇద్దరి సమక్షంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడం ద్వారా భూ వివాదంకు ముగింపు పలికే అవకాశం ఉంటుంది.

ప్రశ్న : భూ సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయా.?


ఎడి : బ్రిటిష్ పాలనలో చేసిన సర్వే ఆధారంతోనే ఇప్పటివరకు భూ రికార్డులు న్నాయి. ఎంతో మంది రైతులు భూ వివాదాల సమస్య లతో సతమతం అవుతున్నారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వం పూర్తిగా భూ ప్రక్షాళనకు రీ సర్వే ద్వారా పరిష్కారం చూపించే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న 1.06 లక్షల ఎకరాల భూ సర్వే డిసెంబర్ 16కు పూర్తి చేయలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. సర్వే అనంతరం ఆయా రైతుల భూములకు హద్దులు చూపించడం, రాళ్ల పాతడం వివాదాలు ఏమీ లేకుండా ఆ రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్న : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? రీసర్వేపై రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

ఎడి : తమ శాఖలో సిబ్బంది కొరత ఏమీ లేదు. ఉన్న సిబ్బందితోనే పగడ్బందీగా రీ సర్వే చేపడుతున్నాం. సర్వే చేసే సమయంలో సర్వే రెవెన్యూ సిబ్బందికి ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు సహకరించాలని కోరుతున్నాం. ప్రజల ముంగిటకే ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చి రైతుల భూ సమస్యల పరిష్కరించడానికి వస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

నివ్య మారుతి సుజుకి షోరూం ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటి మీనాక్షి చౌదరి



మారుతి సుజుకి విక్టోరిస్ కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని శిల్పారామం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'నివ్య ఆటోమోటివ్స్ షోరూం'ను ఆదివారం లక్కీభాస్కర్ సినిమా హీరోయిన్ మీనాక్షిచౌదరి, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ లాంఛనంగా ప్రారంభించారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ అనంతపురం నగరానికి తొలిసారిగా వచ్చానని, ఇక్కడి ప్రజలు తన సినిమాలను ఎంతగానో ఆదరించారని కృతజ్ఞతలు తెలిపారు. సినిమా రంగంతో పాటు తన వంతు సామాజిక సేవ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తమ సినిమాలను మరింతగా ఆదరించాలని కోరారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ అనంతపురంలో ఆటోమొబైల్ రంగం మరింత అభివృద్ధి చెందుతూ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఇలాంటి కొత్త వ్యాపారాలు ప్రారంభమవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నివ్య ఆటోమోటివ్స్ అధినేత మల్లు ప్రసాద్‌రెడ్డి, మల్లు నివేదితారెడ్డి, నివ్య, నారాయణరెడ్డి, వైసిపి నాయకులు రాజకుళ్లాయప్ప, మురళి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహావీర్ శ్రీనాథ్‌రెడ్డి, వ్యాపారవేత్తలు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు. షోరూం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



షోరూం ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి మీనాక్షి చౌదరి

నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

వైద్య బ్రహ్మ ధన్వంతరి జయంతి వేడుకలను నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం నాడు అనంతపురం జయమనెమ్మ కళ్యాణ మండపంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రంగయ్య అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా కర్నూలు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎం.శైలజ, విశ్రాంత ప్రిన్సిపాల్ సారంగపాణి, సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివేకానంద స్వామి, ఎంపీడీవో దివాకర్ హాజరయ్యారు. తొలుత ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్‌మీడియట్‌లో 19 మంది, పదో తరగతిలో 33 మంది విద్యార్థులకు నగదు పురస్కారం, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, విజయనగరం నాగరాజు, శ్రీకాంత్, శివప్రసాద్, శివశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మామిడిలో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం హార్టికల్చర్ డివిజన్‌లోని మామిడి రైతులు ఈ ఏడాది మంచి పంట దిగుబడిని సాధించేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మామిడికి ఆశిస్తున్న వివిధ రకాల చీడపీడల నివారణ కోసం మందులు పిచికారి చేస్తున్నారు. కొందరు రైతులు సొంత తోటలోని పంటలను కాపాడుకుంటుండగా, మరికొందరు తోటలను కౌలుకు తీసుకుని పంటలను రక్షించుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. డివిజన్ పరిధిలోని 6 మండలాల్లో 15,812 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నట్లు ఉద్యానవన అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో మామిడి చెట్లను ఎలా రక్షించుకోవాలనే విషయంలో నిమగ్నమయ్యారు.


మామిడి చెట్లకు మందులు స్ప్రే చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం హార్టికల్చర్ డివిజన్‌లోని పొలాలు ఉద్యానవన పంటలకు ఎంతో అనుకూలం. ఈ కారణంగా వివిధ రకాల ఉద్యానవన పంటలతో పాటు మామిడి తోటలను కూడా రైతులు అత్యధికంగా సాగు చేశారు. ఇక్కడ పండించే మామిడి పంటకు కర్నాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. అయితే పలువురు దళారులు ధర పెరగకుండా దగా చేస్తారు. ఇక్కడి మామిడికి మాత్రం ఇతర ప్రాంతాల్లో మంచి గిట్టుబాటు ధర ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. బేనీషా, బెంగళూరు, మల్లిక, మల్గుబా, లాంటి మామిడి కళ్యాణదుర్గం డివిజన్‌లో రైతులు పండిస్తున్నారు. డివిజన్‌లోని కళ్యాణదుర్గం మండలంలో 3709.97 ఎకరాల్లో, కంబదూరు-1571.04, కుందుర్పి-2964.73, శెట్టూరు-4331.18, బ్రహ్మసముద్రం-2983.64, బెళుగుప్ప- 251.94 మొత్తం 15,812.50 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి.

పంట దిగుబడికి శ్రమిస్తున్నాం



మామిడి పంటలో మంచి దిగుబడి సాధించేందుకు చీడ పీడలను అరికట్టేందుకు శ్రమిస్తున్నాం. ఇప్పటికే సేద్యాలు చేసి ఎరువులు వేశాం. అధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తున్నాం. పదెకరాల్లో 14 ఏళ్ల క్రితం నుంచి మామిడి చెట్లు పెంచి పెద్దవి చేసుకున్నాం. వీటి ద్వారా వచ్చే ఆదాయంపైనే ఆశలు పెట్టుకున్నాం.

- గొల్ల శివన్న, రైతు, పాలవెంకటాపురం

రైతులు మెలకువలు పాటించాలి



మామిడి రైతులు ఇప్పటి నుంచే మెలుకువలు పాటించాలి. అక్టోబర్, నవంబర్ నెలల్లో దుక్కులు చేయాలి. నల్లతెగులు, గడ్డిని అరికట్టాలి. పూత ఇన్‌ఫెక్షన్ కోసం పొటాషియం, నైట్రేట్ స్ప్రే చేయాలి. తోటలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులను తగిన మోతాదులో వేయాలి. పదేళ్ల చెట్టుకు యూరియ 200గ్రాములు, పొటాష్ 100 గ్రాములు. ఒక్కో చెట్టుకు సేంద్రియ ఎరువులు 20-30 కిలోలు వేసుకోవాలి. మైక్రోన్యూట్రీషన్ (జింకసల్ఫేట్ 5 గ్రాములు నీటిలో కలిపి వాడాలి), పాసిట్రైడ్లు, ఫంగిసైడ్లు, మామిడిలో మాల్ఫార్మేషన్ నివారణకు ఎన్ఎఎ 200 పిపిఎం(200 మి.గ్రాల లీటర్ నీటిలో కలిపి వాడాలి.). దోమ పురుగు నివారణకు డైమేథోయేట్ 2 మి.లీ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పూత పరిరక్షణకు కార్బెండాజిమ్ ఒక గ్రామ లీటర్ నీటిలో లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి వాడుకోవాలి. నీటిలో ముళ్ల పురుగుల నివారణకు మిథైల్‌యూజెనాల్ ట్రాప్‌ను బాటిల్‌లో ఏర్పాటు చేయాలి. స్ప్రే చేయడంతో మిక్స్ చేయకుండా విడివిడిగా ఉండాలి.

- కృష్ణతేజ, హార్టికల్చర్ ఆఫీసర్


గుంత తీసి పూడ్చకుండా వదిలేసిన వైనం

గుంతలు తవ్వి.. అలాగే వదిలేసి..!

ప్రజాశక్తి-పుట్లూరు

మొబైల్ నెట్ వర్క్ కోసం మండలంలోని మడ్డిపల్లి నుంచి మడుగుపల్లె మార్గంలో సుమారు 10 కిలోమీటర్ల మేర రోడ్డు పక్కనే కాలువ తరహాలో గుంత తీశారు. సెల్ టవర్‌కు కేబుల్ వైర్‌ను అనుసంధానం చేసేందుకు 4 నెలల క్రితం కంపెనీ ప్రతినిధులు ఈ గుంతను తీశారే కానీ పూడ్చలేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధా నంగా ఎదురుగా వాహనం వస్తే గొయ్యి ఉండడంతో ఎటు పోవాలో తెలియక ఆందోళన చెందు తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సెల్ నెట్‌వర్క్ కేబుల్ వైర్ కోసం తీసిన గోతు లను వెంటనే పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

పోలీస్ శాఖ నిత్యం ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలందిస్తుందని డీఎస్పీ రవి బాబు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ప్రజాసేవలో అమరులైన వారిని స్మరించుకుంటూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థలు, యువకులు సుమారు వంద మంది రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని అనంతపురం సర్వజన ఆసు పత్రికి తరలించారు. శిబిరాన్ని సిఐలు జయా నాయక్, వెంకటరమణ, ఎస్ఐలు, సిబ్బంది పర్య వేక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేతల కుటుంబాలకు ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాప్తాడు నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతిచెందిన టిడిపి నేతల కుటుంబా లకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అండగా నిలి చారు. మండలంలోని వై.కొత్తపల్లికి గ్రామానికి చెందిన టిడిపి ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు గుజ్జల వెంకటేష్ గత శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీత, శ్రీరామ్ ఆది వారం ఆ గ్రామం వెళ్లి వెంకటేష్ మృతదేహంపై టిడిపి జెండా ఉంచి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 50వేలు అందజేశారు. అలాగే ఇటీవల పంపనూరు మాజీ సర్పంచి పద్మావతి భర్త రామచంద్ర అనారోగ్యంతో మృతి చెందగా వారు ఆ గ్రామం వెళ్లి పద్మావతిని పరామర్శించి రూ. 20వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా తాము, పార్టీ అండగా ఉంటామని ఆయా కుటుంబాలకు భరోసా ఇచ్చారు. వారు మాట్లాడుతూ పార్టీలో చాలా కీలకంగా ఉన్న నాయకులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు.


టిడిపి నాయకుని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత, పరిటాలశ్రీరామ్, నాయకులు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

రాప్తాడు : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలోని 64 మందికి మంజూరైన రూ. 31 లక్షల విలువైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి సుమారు 870 మంది సిఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంత వరకూ 16 విడతలుగా 595 మందికి సిఎంఆర్ఎఫ్ కింద రూ. 5.5 కోట్లు మంజూరు చేయించామన్నారు.

సీమ జలరత్నం సుబ్బరాయుడు సంస్మరణ సభ

ప్రజాశక్తి-అనంతపురం


సుబ్బరాయుడు సంస్మరణ సభలో పాల్గొన్న ముఖ్యులు

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమే ఆశయంగా నిర్విరామ కృషి చేసిన విశ్రాంత ఇంజినీర్ ఎం.సుబ్బరాయుడు రాయలసీమ జలరత్నమని ఎస్‌కెయు విశ్రాంత వైస్ ఛాన్సలర్ కాడా రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలోని వేమన సెంటర్‌లో ఆదివారం రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో రాయల సీమ సాగునీటి నిపుణుడు ఎం.సుబ్బరాయుడు సంస్మరణసభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ సుబ్బరాయుడు రాయల సీమకు అవసరమైన అనేక ప్రాజక్టులకు రూపకల్పన చేశారని కొనియాడారు. కృష్ణా, తుంగభద్ర నదుల నీటిని సమగ్రంగా సీమకు ఎలా ఉపయోగించాలో గొప్ప అధ్యయనం చేశారన్నారు. జిల్లాలో కరువు నివారణకు హెచ్‌ఎల్‌సీ సమాంతర కాలువ నిర్మాణమే పరిష్కారమని ప్రతిపాదించారని తెలిపారు. రాయలసీమ సాగునీటి సాధన కోసం నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో అనంత సాగునీటి కార్యకర్త రామాంజినేయులు, అధ్యాపకులు దామోదరరెడ్డి, రైతుసంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, విశ్రాంత డ్వామా అధికారి మనోహర్‌రెడ్డి, స్వచ్ఛంధ సంస్థల నాయకులు బోస్, కవులు మధురశ్రీ, రియాజ్, జూటూరు తులసీదాస్, నర్సిరెడ్డి, వీరభద్రప్ప, ప్రజా సంఘాల నాయకులు రాహుల్, వేమన, రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పుష్కల్ ఆగ్రో టెక్ లిమిటెడ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలత, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ డి.కవిత, కంపెనీ ప్రతినిధి ఎం.జగదీష్ తెలిపారు. సేల్స్ ఆఫీసర్, ఆఫీస్ బాయ్, డిఎండి(అగ్రి బీఎస్సీ)-4 పోస్టులు ఉన్నాయన్నారు. 19-35 ఏళ్ల లోపు ఉండి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. నెలకు రూ. 10వేల నుంచి రూ. 15వేల వేతనం ఉంటుందన్నారు. ఇన్సెంటివ్, కమీషన్, టిఎ, డిఎ కూడా చెల్లిస్తారన్నారు. వివరాలకు ఎం.జగదీష్- 83744 48848, పి.అనిల్‌కుమార్-97059 06621లో సంప్రదించాలన్నారను.

వైసిపి పాలనంతా దోపిడీమయం:టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు

వైసిపి పాలన మొత్తం దోపిడీలమయమని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, టిడిపి హిందూపురం పార్లమెంట్ ప్రతినిధి శశాంక్ చౌదరి విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల నాయ కులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి హయాం లో నియోజకవర్గ వ్యాప్తంగా అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, ఆ పార్టీ నాయకులు ఎంత దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ప్రధానంగా ఆ ఐదేళ్లలో ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లను అడ్డం పెట్టుకొని ఉపాధి హామీతో పాటు పలు సంక్షేమ పథకాల్లో పెద్దఎత్తున అక్రమా లకు పాల్పడ్డారన్నారు. మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ బాలపోతన్న దంపతులు, ఎంపిపి హేమలత, వారి తల్లిదండ్రులు 2019 నుంచి 2024 వరకూ ఉపాధి హామీ పనులకు వెళ్లకపోయినా దొంగ బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమా ర్కులు, అవినీతిపరులు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్‌పై తప్పుడు నిందలు వేయడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో నాయకులు కందులు ఓబుళపతి, బొమ్మయ్య, ఉమాపతి, కొండారెడ్డి, ఓబుళపతి, రామదాసు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు

వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధాయాదవ్


ప్రజాశక్తి-గుత్తి


అనంతకు పూలబొకే ఇస్తున్న రాధ

వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా మున్సిపాలి టీలోని సురసింగనపల్లికి చెందిన చంద్రగిరి రాధాయాదవ్ నియమితుల య్యారు. దీంతో ఆమె ఆదివారం అనంతపురంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

టిడిపి అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి హేమలత

'అధికారం అడ్డుపెట్టుకుని దోచుకోవడం.. వారి అవినీతి బాగోతం బయట పడగానే ఇతరులపై బురద జల్లడం టిడిపి నేతలకు వెన్నతో పెట్టిన విద్య' అని ఎంపిపి సుబ్బర హేమలత పేర్కొన్నారు. ఆమె ఆత్మకూరులో ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నుంచి కార్యకర్త వరకూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నార న్నారు. టిఎన్ఎస్ఎఫ్ సభ్యుడు బండి పరుశురాం అనంతపురంలో నివాసం ఉంటూ, మండలంలోని బి.యాలేరులో ఉపాధి హామీ పనులకు వెళ్లకపోయినా వెళ్లినట్లు దొంగ బిల్లులు సృష్టించి దోచుకుంది, మండల కన్వీనర్ శ్రీనివాసులు బాస్యంకుంట మరమ్మతుల పేరిట దొంగ బిల్లులు చేసుకున్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో టిడిపి నేతల అవినీతిపై త్వరలోనే ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం : వైసిపి

ప్రజాశక్తి-నార్పల

కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గ మైన చర్య అని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్, రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్య నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం ఆ పార్టీ మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్ ఆధ్వర్యంలో మండలంలోని సిద్దిరాచర్ల, దుర్గం, గొల్లపల్లి, బండ్లపల్లి, పప్పూరు, తుంపెర గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ-రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. శైలజనాథ్ మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రారంభించిన 15 వైద్య కళాశాలల్లో 5 పూర్తయ్యాయని మిగిలిన వాటిని చంద్రబాబు పూర్తి చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి విద్యా వ్యాపారం చేయాలని భావించడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్ప, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని ఓబులాపురం గ్రామంలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ సారథ్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అందులో వైసిపి జిల్లా కార్యదర్శి వెంకటరమణ యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : పిపిపి విధానాన్ని విరమించుకొని వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న అసమర్ధ కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమం ద్వారా నిలదీద్దామని పిలుపునిచ్చారు. ఉరవకొండలో వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా విశ్వతో పాటు నియోజకవర్గ పరిశీలకులు రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, యువజన విభాగం రాయలసీమ జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా విశ్వ తొలి సంతకం చేసి కోటి సంతకాల సేకరణను ప్రారం భించారు. కూటమి ప్రభుత్వ బినామీలకు వేల కోట్లు దోచిపెట్టడానికే ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేపరం చేస్తున్నారన్నారు. అమరావతిలో టిడిపి నేతల భూములకు ధరలు పెంచుకునేందుకే రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.


కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శైలజనాథ్



ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో క్రీడాకారులతో రాజ్‌కుమార్

ఏకాగ్రతతో సాధన చేస్తే లక్ష్యాన్ని ఛేదించవచ్చు

ప్రజాశక్తి-అనంతపురం

క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో సాధన చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించవచ్చని ఎపి రైఫిల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీని సందర్శించారు. రైఫిల్ షూటింగ్, పిస్టల్ విభాగాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్‌ను అభినందించారు. అకాడమీలోని వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. స్పోర్ట్స్ కోటాలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. జూనియర్ వరల్డ్ కప్ ఎయిర్ పిస్టల్ విభాగంలో గుంటూరుకు చెందిన ముకేష్ నెల్లవెల్లి, ఎయిర్ రైఫిల్ విభాగంలో ఉమామహేష్ బంగారు పతకాలు సాధించగా వారికి సిఎం చంద్రబాబు రూ. 70 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. దీంతో సిఎం చంద్రబాబుకు రాజ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఆర్యన్ అకాడమీ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం : సోలార్ ప్రాజెక్టు ఛైర్మన్


రైతులతో సమావేశమైన ప్రాజెక్టు ఛైర్మన్

కళ్యాణదుర్గం రూరల్ : సోలార్ ప్రాజెక్టుకు భూములిచ్చే రైతులకు అన్ని విధాలా అండగా ఉం టామని ఆ ప్రాజెక్టు ఛైర్మన్ ఛైర్మన్, ఎండి చెరకు అనిల్ దయాకర్ తెలిపారు. సోలార్ ప్రాజెక్టుకు భూము ల విషయంపై ఆదివారం కంబదూరు మండలంలోని రాంపురం గ్రామంలో శ్రీశక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ ఛైర్మన్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుకు 2,600 ఎకరాలను అద్దెకు ఇవ్వడానికి సముఖత తెలిపిన రైతులను అభినందించారు. రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏడాదికి ఎకరాకు రూ. 33వేల అద్దె చెల్లిస్తామని, ఏటా 10శాతం పెంచుతామన్నారు. విద్యా అర్హతను బట్టి రైతు కుటుంబంలోని యువకులకు నెలకు రూ. 20వేల నుంచి రూ. 50వేల వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. రైతు కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు వస్తే బ్యాంకు తరహాలో కంపెనీ రుణ సహాయం చేస్తుందన్నారు. సోలార్ ప్రాజెక్టులో వచ్చే లాభాల్లో కొంత విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ జయంత్, జెట్టి రామచంద్ర, రీజనల్ డైరెక్టర్ సూర్యం, తెలంగాణ డైరెక్టర్ బాబన్న రైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యుల సమ్మెకు సిబ్బంది సంఘీభావం

బ్రహ్మసముద్రం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిహెచ్‌సి వైద్యులు చేపట్టిన సమ్మెకు వైద్య సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యులు మాట్లాడుతూ 99 జీవో రద్దు, పీజీ కోర్స్‌లో సర్వీస్ కోటా పునరుద్ధరణ, టైం బాండ్ ప్రమోషన్స్, ఇతర డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అఫ్తాఫ్, హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్, సూపర్వైజర్ రామలక్ష్మమ్మ, ఫార్మసీ ఆఫీసర్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్ కుమార్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం అనుమతులు పొందకుండా మైదానం లో బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. క్రీడా మైదానంలో టపాసుల విక్రయ కేంద్రా లు ఏర్పాటు చేయకూడదని కళాశాల యాజమాన్యం చెప్పినా అడ్డగోలుగా షెడ్లు ఏర్పాటు చేసుకో వడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంద న్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణసంచా విక్రయించడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అన్నారు. క్రీడా మైదానాన్ని అపరిశు భ్రం చేయడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు.

22న సంతాన సాఫల్య వైద్యశిబిరం


గుత్తి : పట్టణంలోని కెజిఎన్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఈ నెల 22వ తేదీ ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంతానం లేని దంపతులకు వైద్య నిపుణులు మైత్రాయి రాజు పరీక్షలు చేసి చికిత్స అందిస్తారన్నారు.

మార్కెట్ సంతల ఆదాయం రూ. 3.81 లక్షలు

అనంతపురం : నగరంలోని మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన పశువుల సంతలో రూ. 3.81లక్షల ఆదాయం వచ్చినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి రాఘవేంద్రకుమార్, సూపర్ వైజర్ కిషోర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

దుకాణాలు తొలగించరాదని ఎమ్మెల్యేకు వినతి

గుత్తి : పట్టణంలోని అన్న క్యాంటీన్ సమీపంలో గుంతకల్లు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించ రాదని ఆదివారం దుకాణదారులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను కలిసి విన్నవించుకున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, అయితే ఇటీవల అధికారులు దుకాణాలు తొలగించాలని మార్కింగ్ వేశారని ఎమ్మెల్యేకు వివరించారు. దుకాణాలు తొలగిస్తే రోడ్డున పడతామని వాపోయారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శీనయాదవ్, వీరన్నగౌడ్, దేవేంద్ర గౌడ్, కంబన్నగౌడ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జయరామ్‌ను కలిసిన దుకాణదారులు

వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో వార్డు, గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రధాన, అనుబంధ విభాగాల కమిటీలను సకాలంలో ఏర్పాటుచేసి వైసిపిని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంస్థాగత యాక్టివిటీ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని నియోజకవర్గ ఆ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసంలో ఆదివారం సాయంత్రం మెట్టు అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రా మిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ఎల్ఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వజ్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలపై కూటమి నాయకులు వేధింపులు, దాడులకు పాల్పడితే వారిపై డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మెట్టు, మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, ఉషారాణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల వాగ్వాదం

సమావేశం జరుగుతుండగానే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌని ఉపేంద్రరెడ్డి సమావేశం నుంచి బయటికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా జిల్లా అధ్యక్షులు, పరిశీలకులు కూర్చోమని వారించారు. ఉపేంద్రరెడ్డి సోదరుడు శ్రీరామ్‌రెడ్డి, నాగరాజురెడ్డి మాట్లాడుతూ గౌరవం ఇవ్వనప్పుడు మాట్లాడటం ఎందుకని ప్రశ్నించారు. దీంతో కాసేపు గందరగోళం, వాగ్వాదం నెలకొంది. ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ పార్టీలో అసమ్మతి లేదని, అయితే ముందు నుంచి పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు, ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. అనంతరం అందరూ పార్టీ కోసం పని చేస్తామని ప్రకటించారు.


సమావేశంలో వాగ్వాదానికి దిగిన వైసి నాయకులు

నేరాలు ఘోరాలు

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

బొమ్మనహాల్ : అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘ టన మండలంలోని ఉంతకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. శెట్టూరు మండలంలోని పెద్దగొల్లపల్లికి చెందిన గొల్ల గోవిందప్ప(58) మద్యం అలవాటు మానేయాలనే ఉద్దేశంతో మాల వేసుకునేందుకు ఆదివారం ఉంతకల్లులో వెలసిన పాండురంగస్వామి దర్శనార్థం వచ్చారు. అయితే ఉంతకల్లులో అతిగా మద్యం తాగి ఆ మత్తులో బహిర్భూమికని ఆరు బయటకు వెళ్లి అక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబిరసూల్ తెలిపారు. మృతదేహాన్ని బళ్లారి ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం అతడి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మహిళ...

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుర్షిదా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కుర్షిదాను వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు..

తాడిపత్రి రూరల్ : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై ఓ ఎద్దు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని మంచినీటి సంపు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడం వలన అదే గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణకు చెందిన ఎద్దు అటుగా వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ ఎద్దు సుమారు రూ. 80 వేలు విలువ చేస్తుందని బాధిత రైతు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో పాత్రికేయునికి గాయాలు

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో పాత్రికేయునికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని పులి ప్రొద్దుటూరు గ్రామ సమీపంలో తాడిపత్రి-గుత్తి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పాత్రికేయుడు రంగనాయకులు భార్య అశ్వినితో కలిసి బైక్‌ఐ గుత్తి వైపు వెళ్తుండగా పులిప్రొద్దుటూరు గ్రామ సమీపంలో ఓ ట్రాక్టర్ అదుపుతప్పి వీరిపైకి దూసుకెళ్లడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో రంగనాయకులు తలకు తీవ్ర గాయం అవ్వగా అశ్వినికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.